# ఉష్ణమొస్తే బావుణ్ణు.

'పదహా రార్లు తొంభై ఆరూ!'

చిన్నవాడు కునికిపాట్లు పడుతూ వల్లిస్తున్నాడు పద హారో ఎక్కాన్ని. నాన్న తను తిరిగొచ్చేదాకా ఎక్కాల్ని కంఠతా పెట్టమన్నాడు. చిన్నవాడికి నిద్రవస్తున్నాది. కానీ, నాన్నభయంచేత దీపంముందుకు బోవలసివచ్చింది.

'పదహా రేళ్ళు నూట...'

వెధవెక్కం అని విసుక్కున్నాడు. వల్లించమన్న నాన్ననికూడా తిట్టేడు. నాన్నసొమ్మేంపోయింది? నాలుగు ప్రక్కలా చూశాడు. అమ్మమ్మ నట్టింట్లో ఏదో వెర్రి మొర్రి పాట పాడుకుంటూ అంట్లూ ఎంగిళ్ళు చేసుకొంటున్నాది. అమ్మ అన్నమంచంప్రక్క కూచొని, వాడి తలమీద అయిసుపెడుతున్నాది. ఎవరూ తన్ను చూడ్డంలేదు. చిన్న వాడు తను కష్టపడి చదవడం, ఎవరూ చూడకపోవడం చూసి చాలా అసంతృప్తిపడ్డాడు. ఘట్టిగా 'పదహారేళ్ళు నూటపన్నెండు' అని అరచేడు. ఎవరూ లక్ష్యపెట్టలేదని గ్రహించి, ఇంకా ఘట్టిగా ఇల్లెగరకొట్టూ 'పదహా రెనిమి దులు నూటాఇరవై ఎనిమిది' అని దీర్ఘాలుతీస్తూ పాట మొదలెట్టాడు.

ఈసారి చిన్నవాడివాంఛ కొద్దిగా సఫలీకృతమైంది. పెద్దవాడు కళ్ళువిప్పి 'అమ్మా! వాణ్ణి అరవొద్దనే?' అని అన్నాడు. అమ్మ వాడినొసట చెయ్యిపెట్టి ఉష్ణపువేడిని

చూస్తూ 'ఏమిటి నాయనా?' అని అడిగింది. 'వాణ్ణరవొద్దనే' అని వాడు చాలా నెమ్మదిగా చెప్పేడు. అమ్మ 'ఒరే చిన్నవాడా, అరవకురా!' అని కేకేసింది. 'బ్బ! ఎక్కాలు చదువుకొంటున్నానే' అని నిర్లక్ష్యంగా జవాబుచెప్పి 'పదహారొకట్ల పదహారూ' అని ముందుకొచ్చాడు. 'ఒరేయ్ నీకు కాదురా చెప్పేది' అని అమ్మ అంది. 'హుఁ, నాన్న కోంపడతారు. ఎక్కాలు అప్పజెప్పాలే!' అని చిన్నవాడన్నాడు. 'నే చెప్తా కోంపడరు. వెళ్లిపడుకో' అని అమ్మ అంది. వెంటనే చిన్నవాడు పక్కమీదకి దూకేడు. వాచీ పదికొట్టింది.

అదేమోగాని చిన్నవాడికి నిద్రరాలేదు. పడుక్కొని ఆలోచించుకొంటున్నాడు.

రేపు సోంవారం. మళ్ళా బడి. పొద్దున్నే లేవాలి. రేపూ ఆదివారమైతే బావుణ్ణు. శలవులు ఎప్పుడిస్తారో కదా! అన్నకి పన్నెండురోజులనుండీ ఉష్ణం. తనకే ఉష్ణమొస్తే బావుణ్ణు. ఎంచక్కా బడి మానీవచ్చు. మరింక ఎక్కాలూ లెక్కలూ ఇవన్నీ వుండవు. ఇంక నాన్నగూడా గోడకుర్చీలు వేయించడు. మరి శొంతిపిక్కలూ తొడపాశాలూ ఏంవుండవు. అన్నని పూర్వంలాగా నాన్న కొట్టడంలేదు. 'నాయనా!' అని నెమ్మదిగా పిలుస్తాడు.

అవును; తనకీ ఉష్ణమొస్తే బావుణ్ణు. అన్నకి ద్రాక్షపళ్లు బత్తాయిపళ్ళూ తెచ్చియిస్తారు. తనకి ఎవరూ ఇవ్వరు. అన్న మంచివాడే. అన్నీ తనుతినడు. అసలు ఒకప్పుడు తినే తినడు. అన్నీ తనకే ఇచ్చేస్తాడు. రెండురోజులాయి అన్నకి పళ్ళు ఇవ్వలేదు. అన్న చాలా మంచివాడేగానీ వెధవ ఉష్ణం లేని

రోజుల్లో ఎప్పుడూ తనతోటి దెబ్బలాటలే. పలకపుల్లకీ పెన్సిలుకీ అన్నింటికని ఒంటెత్తు వెధవ. ఉష్ణమొచ్చాక తలమీద. ఐసు పెట్తారు, వెధవది చక్కా తిననివ్వరుండా. వేడికి చలవ, చలవకి వేడి - తండామాల్. ఎంచక్కా వుంటుంది. నిన్న ఓ ముక్క తీసుకొంటే నాన్న వీపు పెట్లకొట్టి 'ఫో వెధవా' అన్నాడు.

ఆలోచించుకొంటూ చిన్నవాడు నిద్రపోయేడు. చిన్నవాడికి నిద్రపోయేక కల వచ్చింది. ఒకంమంచంమీద తను పడుకున్నాడు. తనతలమీద అమ్మ ఐస్ బేగ్ పెట్టింది. తను మంచంమీద పడుకొని ఎక్కాలు చదువుకుంటున్నాడు. నాన్న 'వెధవా! గోడకుర్చీ వేయ్' అని గద్దించేడు 'నాకు ఉష్ణమొచ్చింది నేను ఎక్కాలు చదవను' అని తను తిరగబడ్డాడు. కానీ, నాన్న సొంటిపిక్క పెట్టాడు. తను నవ్వుతున్నాడు. ఐస్కిలడ్డూ తింటూ తను బడికి వెళ్ళాడు. మాస్టరిగారి కుర్చీలో నాన్న కూర్చున్నాడు. 'నాకు ఉష్ణమొచ్చింది, బడికి రాను మాస్టరూ!' అని చెప్పాడు. బళ్ళో మరెవరూ పిల్లలు లేరు. తనొక్కడే ఆడుకొంటున్నాడు. రాత్రి రెండవుతుంది. చిన్నవాడు వత్తిగిల్లేడు చలి బాగా వేస్తున్నది. వాడు రాత్రి పడుకోబోయేముందు కప్పుకోలేదు. వాడికి తెలివచ్చేసింది. అమ్మా నాన్నా మాట్లాడుకొనేమాటలు వాడికి వినబడుతున్నాయి.

'రెండున్నరా?'

'ఊఁ!'

'మందు వేళయిందికదూ!'

'ఊఁ!'

'పడుకొన్నాడు. లేపనా?'

'వద్దు, లేపకూడదు '

చిన్నవాడు కళ్ళుమూసుకొనే ఈమాటలు వింటున్నాడు. చిన్న చలిగాలి వీచింది. వళ్ళు ఝల్లుమంది. కీచురాయి గీపెట్తూంది. 'అమ్మా చలే' అన్నాడు.

'చిన్నవాడికే దేనాకప్పు!' అన్నాడు నాన్న మెల్లిగా. చిన్నవాడు కళ్ళువిప్పేడు. దీపం మసిబారింది. మసక మసగ్గా ఉంది. అమ్మా నాన్నా అన్నమంచానికి రెండుప్రక్కలా కూర్చొన్నాడు. అన్న మంచానికి ఓపక్క బల్లమీద మందు సీసా లున్నాయి వాచీ టిక్ టిక్ మంటున్నాది? ఒక మూల అమ్మమ్మా వాళ్ళూ పడుకొన్నారు. అమ్మ లేచి తనకి శాలువ కప్పింది.

చిన్నవాడికి చిన్న మాగన్ను పట్టింది. ఒక కారడవిలో తనున్నాడు. అన్న పలకపుల్ల తెచ్చాడు. చిన్నవాడికి చాలా గొంతుకలు వినబడుతున్నాయి. 'ఎలా వుంది?' అని ఓగొంతు ప్రశ్నించింది. 'చాలా వేడిగా వుంది; కాగిపోతున్నాది' అని తనే చెపుతున్నాడు. చిన్నవాడికి మెళుకువ వచ్చింది. టైమెంతయిందో తెలీదు. చిన్నవాడికి వాచీ చూడ్డంరాదు. కానీ ముళ్ళెక్కడున్నాయో చెప్తాడు. చిన్నవాడు కళ్ళువిప్ప లేదు. వింటున్నాడు.

'ఎలా ఉందే?'

'చాలాజాస్తిగా, వళ్లు కాలిపోతున్నది.

'అల్లుడు బా బేడీ?'

'డాక్టర్ని తీసుకు రావడాని కెళ్ళారు.'

'ఎంతసేపాయి'

'పావుగంట నిన్ను లేపలే. పోతా మనుకున్నాను గానీ ఒక్కర్తెనే ఉండలేక భయమేసింది...'

చిన్నవాడు కళ్ళువిప్పేడు. అమ్మా అమ్మమ్మా పిన్నీ అంతా అంతా మాట్లాడుకుంటున్నారు. నాన్న లేడు దీపం గాలికి మండింది. అమ్మ వత్తి హెచ్చించింది. చిన్నముల్లు నాలుక్కీ ఐదుకీ మధ్యా పెద్దముల్లు ఆరుకీ ఏడుకీ మధ్యా ఉన్నాయి.

'అమ్మా! దాహమేస్తోంది' అన్నాడు. అమ్మమ్మవచ్చి తనకి మంచినీళ్ళించి. ఇంతలోకే నాన్నా డాక్టరుగారూ వచ్చారు డాక్టరుగారు పంచా పైమీద వాణీ వేసుకొన్నారు. డాక్టరుగారు రిస్టువాచీ చూస్తూ అన్న చెయ్యి చూశారు. తరవాత తన కెవరో అడ్డమొచ్చారు. అమ్మా నాన్నా అంతా రాత్రిపడుకున్నట్టు లేరు. అందరూ ఆందోళనగా ఉన్నారు.

అన్న చచ్చిపోడుకద! అన్న చచ్చిపోకూడదు. చచ్చిపోడు. వాడికి ఉష్ణంపోతుంది. తనకి ఉష్ణమొస్తే బావుణ్ణు గానీ, అమ్మో, ఉష్ణమొస్తే చచ్చిపోతారు. ఎవరికీ ఉష్ణం రాకూడదు. చిన్నవాడు ఆలోచించుకుంటూ పక్కమీద దొర్లాడు. ముసుకుతన్ని పడుక్కొన్నాడు.

అంతా గొల్లుమంటూ ఉంటే తను లేచాడు. బాగా తెల్లవారింది. తనులేచి చూశాడు. అన్నమంచం ఖాళీ. వరండా. మీద అన్నని పడుకోబెట్టారు. అమ్మ అన్నమీద పడి ఏడుస్తున్నది. అంతా ఏడుస్తున్నారు. నాన్న తలుపు కాడ నిలబడి కళ్ళంట నీరుకారుస్తున్నాడు. ఇదిచూడగానే చిన్నవాడికి గుండెల్లో కుదుపొచ్చింది. దానితోనే వాడివళ్లు కాగ మొదలెట్టింది. తను దగ్గరకెళ్లాడు. ఎవరో 'ఝుకుసు కొంటా' వంటూ ప్రక్కకు తీసుకుపోయారు.